
# మళ్ళీ అమరావతి కథలు

## సత్యం శంకరమంచి




"కథ చెప్పు తాతయ్యా" అని వేధిస్తున్నారు శాస్త్రిగారి మనమలు చుట్టూ చేరి.

"ఏం కథ చెప్పమురా?" అని ఆలోచిస్తున్నట్టు బోసి నోరు విప్పి పైకి చూశాడు ఎనభై ఏళ్లు పైబడుతున్న శాస్త్రిగారు.

"ఏదో వొహటి" అంటూ నిద్రకి ఓ పక్క ఆవులిస్తూ చేతులు పట్టుకు గుంజుతున్నారు పిల్లలు.

"సరే" అంటూ... మొదలెట్టాడు శాస్త్రిగారు. "ఒక రోజున...." ఊ కొడ్తున్న చిన్న పిల్లలతోపాటు పట్నం కాలేజీలో చదువుతున్న శాస్త్రిగారి పెద్ద మనవడు కూడా చదువుతున్న పుస్తకం మూసి వింటున్నాడు.

"చాలా సంవత్సరాల క్రితం... నాకు పెళ్లయిన కొత్తల్లో..."

"అంటే నేను పుట్టిన తర్వాతేనా?" అన్నాడు ఆఖరి మనవడు.

"ఇష్" అని నోరంతా విప్పి నవ్వి వాణ్ణి వొళ్లోకి తీసుకుని మళ్లీ మొదలెట్టాడు శాస్త్రిగారు.

"పెద్దింటమ్మ గుడి దగ్గర చేనికెళ్లి వస్తున్నాను. అటూ ఇటూ పొలాలు, కనుచూపుమేర భూమంతా పచ్చటి కంబళీ పరిచినట్టుంది. నేలతల్లి చిలకాకుపచ్చ చీర వొళ్లంతా చుట్టుకున్నట్టు పొలాలు. పొలం చుట్టూ తిరిగి, గట్ల పక్కన కుంటలో కాసిన్నీళ్లు తాగి అట్లా డొంకలో కొచ్చాను . మావిళ్ల చేను దాటానో లేదో చిటపట చినుకులు ప్రారంభమైనాయి. తలెత్తి పైకి చూస్తే సూర్యుడెక్కడికో పారిపోయాడు. నల్ల మేఘాలు గుంపులు గుంపులుగా పరుగెత్తుతున్నాయి. ఆకాశమంతా నల్ల మేఘాలే.




నల్లచీర కట్టుకున్న ఆడదాని మొల్లో బాకులాగా ఆ నల్ల మేఘాల మధ్య ఓ మెరుపు, తూర్పు వైకుంఠపురం కొండమీద ఓ గర్జింపు — వాన పెద్దదైంది.

వలవల కురుస్తోంది వాన!

జలజల కురుస్తోంది వాన!

నేను గొడుగు తెచ్చుకోకపోతిని. పూర్తిగా తడిసిపోయాను. అయినా గొడుగులూ గోనె గుడ్డలు ఏవిటి? అల్లంత ఆకాశగంగ పనిగట్టుకొచ్చి ఈ నేలతల్లిని చల్లగా కౌగిలించుకుంటుంటే — ఈ మనిషన్న వాడెవడు గొడుగడ్డం పెట్టుకోటానికి?




ఉన్నట్టుండి మబ్బులు పెద్దపెట్టున ఉరిమాయి. వర్షరాణి తీవ్ర వేగంతో రథం నడిపిస్తుంటే రయ్యిన పరుగెత్తే రథ చక్రాల ధ్వనిలా వుంది ఆ ఉరుము. ఆ ఉరుము అలా దూరమవుతుంటే అదిలించినప్పుడు ఆ రథానికి పూన్చిన గుర్రం సకిలింపులా వుంది. అల్లంతలో మబ్బుల్లో గొప్ప మెరుపు. అది వర్షరాణి కిరీటంలా వుంది. కిరీటమే కళ్లు మిరుమిట్లు గొల్పితే ఆ రాణి ఎలా వుంటుందో! అలంకారాలు చూడ్డానికే ఈ కళ్లు మూసుకుపోతుంటే ఇంక ఆకారాలెలా కన్పిస్తాయి?

డొంకలో బురద బురదయిపోయి కాలు సాగడంలేదు. చెప్పులు విడిచి చేత పట్టాను. "వ రెవరె! అప్పుడనిపించిందిరా! గంగమ్మ ఈ భూమినంతటినీ చల్లబరుస్తుంటే నేనూ చల్లబడక ఈ పాత చెప్పులడ్డం పెట్టుకున్నానా" అని. ఇప్పుడు వర్షం నామీద కురుస్తోంది. నాలోంచి కురుస్తోంది. జల్లుజల్లుగా కురుస్తోంది. భళ్లుభళ్లున కురుస్తోంది. వర్షపు చల్లదనం శిరస్సు నుంచి పాదాల దాకా పాకి శరీరంలోని సర్వాణువుల్నీ కడిగేస్తోంది. ఆ చల్లదనం నరనరాల్లోకి పరుగులెత్తి వెచ్చగా వుంది. అది ఎన్ని స్నానాల పెట్టు! ఎన్ని మునకలు దానికి దీటు! వర్షమంతా నామీదే పడాలనిపించింది. నన్ను ముంచెయ్యాలనిపించింది. ఆ సమయంలో నేను నడవడం మానేసి, ఒరేయ్! ఆ డొంక మధ్యలో నిటారుగా నుంచున్నారా!

అటు పక్క చూస్తే పొలాలమీద వాన, మంచి శనగ చేనుమీద వాన పడుతుంటే పైరు పైరంతా ఆనందంగా వూగుతోంది. ధనియాల చేను మీద వాన పడుతుంటే ఆ మేరంతా కొత్తిమెర వాసన. వాన సుగంధం కలిసిపోయిన గాలి, వానకి జొన్నచేను నృత్యం చేస్తోంది. మొక్కజొన్న కండెలుబ్బిపోతున్నాయి. సజ్జ కంకులు పొంగుతున్నాయి. వరి వున్నట్టుండి పెరుగుతోంది. కంది కాయలు, పిల్లి పెసర్లు కువకువలాడ్తున్నాయి. నేరుశనగ చేను విచ్చుకుని వేళ్లలోకి దింపుకుంటోంది వర్షధారల్ని. అలా నేల నేలంతా పైరు పైరంతా వర్షానికి పరిపరి విధాలుగా పులకలెత్తుతోంది. పొలాల మీద వాన కొంచెం తగ్గుముఖం పట్టినట్లనిపించింది. కుడిపక్కకి తిరిగిచూస్తే కృష్ణమీద వర్షం జోరుగా వుందనిపించింది. కృష్ణ ఒడ్డుకు బయల్దేరాను. అలా ఎందుకనిపించిందీ



అని అడక్కు. రంగావఝ్ఝులవారి చేనుదాటి అలా కృష్ణ ఒడ్డుకు వస్తిని కదా—

వరె వరె వరె! అదీ వర్షం.

"అంత గొప్ప ప్రవాహంలో సంతత ధారగా వాన పడిపోతోంది. నీళ్లలో నీళ్లు! ధారలో ధార! ప్రవాహంలో ప్రవాహం! వాన చినుకులు కృష్ణలో పడుతుంటే పెద్దక్క ప్రేమగా హత్తుకుంటే ఒళ్లు జలదరించినట్టు, ఆ ప్రవాహంమీద ఓ జలదరింపు, ఓ పులకరింపు. సిగ్గుతో నవ్వినప్పుడు బుగ్గమీద సొట్టలా చినుకుపడ్డ చోట చిన్న గుంట. అంతలో ఆ గుంట మాయం. మళ్లీ చినుకు మళ్లీ గుంట. మళ్లీ మళ్లీ చినుకులు. అంతలో మాయమై మళ్లీ మళ్లీ గుంటలు. కృష్ణంతా చినుకులు: కృష్ణంతా పులకరింతలు. ఇసక మీద చినుకులు. కసకస చినుకులు. రేణు రేణువుకి చినుకులు, విసవిస, సరసర చినుకులు. రివ్వుమని, రయ్యిమని చినుకులు, ఊపులా చినుకులు, తాపులా చినుకులు, చళ్లుమని, ఫెళ్లుమని, ఢభిల్లుమని, ఫెఠిల్లుమని చినుకులు- చినుకులు - కృష్ణ నిండా, ఇసక నిండా, నేల నిండా- చినుకులు చినుకులు- రెండు గంగలు కలిసిపోయినట్టు, నింగీ నేలా ఒకటే అన్నట్టు, ఈ జగత్తులో నీళ్లు తప్ప ఇంకేమీ లేనట్టు అన్నిటికీ నీళ్లే ఆధారమన్నట్టు వాన, వర్షం, గంగమ్మ, కిష్టమ్మ, సంద్రం- అదేదో దానికి నువ్వే పేరైనా పెట్టుకో.

"అలా ఆ అఖండ జల ప్రపంచం మధ్య మతిపోయి నుంచున్నానా- పడవ్వాళ్లు నలుగురైదుగురు వచ్చి "శాస్త్రుల్లుగారు ఈడున్నారేటి?" అన్నారు. అప్పుడీ లోకంలో పడి- నేనిక్కడే వుంటానంటే "ఇదేవన్నా మతి భ్రమణవేమో" అనుకుంటారేమోనని వాళ్ల వెంట వూళ్లోకొచ్చాను..."

"వర్షం ఆగిపోయిందని చెప్పకు తాతయ్యా" అన్నాడు కాలేజీలో చదువుతున్న మనవడు. అప్పటికి మిగతా మనవలు నిద్రపోయారు.

"లేదురా ఇంకా కురుస్తోంది. ఆగకుండా కురుస్తోంది. ఇల్లు దగ్గరపడుతున్న కొద్దీ కంగారెక్కువయింది. మీ నాయనమ్మ, కొత్తగా కాపరానికొచ్చిన చిన్నపిల్లయ్యె! అందులో పట్నంలో కచ్చేరీ గుమాస్తాగారి కూతురేమో, వర్షంలో తడిసి జలుబు చేసి ఎక్కడ ముక్కూడగొట్టుకుంటుందో అని గబగబ నడిచాను. ఇంట్లోకొస్తే ముందు వరండాలో లేదు. మధ్య గదిలో లేదు. వంటింట్లో లేదు. "ఓహోయ్!" అని కేకేస్తే బదులు లేదు. గబగబ దొడ్లోకొస్తే దొడ్డి చివర ఆరుబయట కృష్ణ వైపు తిరిగి నుంచుని కన్పించింది. వర్షం కృష్ణలో కలుస్తుంటే, కృష్ణ వర్షంలో కలుస్తుంటే, వర్షంలో తను కలిసిపోయి చేతులు విప్పార్చి తల మునకలుగా హాయిగా తడుస్తోంది.

